# మూగజీవాలను తరలిస్తే చర్యలు

**కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్**

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 7: అనుమతి లేకుండా మూగజీవాలను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ సురేశ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూగ జీవాలను తరలిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, స్వయంగా వాహనాలను అడ్డుకొని గొడవలు సృష్టించడం సరికాదని తెలిపారు. పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు పశు సంవర్ధక శాఖ సమన్వయంతో చెక్ పోస్ట్ ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

# 'ముఖాముఖి'కి రాజేశ్వర్ ఎంపిక

జన్నారం, జూన్ 7 : జన్నారం మండలం కిష్టాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థి రాథోడ్ ఈశ్వర్ పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించి జిల్లా టాపర్‌గా నిలిచాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 9న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ముఖాముఖి కార్యక్రమానికి రాథోడ్ ఈశ్వర్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి రాథోడ్ ఈశ్వర్‌తో పాటు అతని తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయుడిని సన్మానించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే 10న హైదరాబాద్‌లోని హరిహర కళా భవనంలో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శితో పాటు ఇతర రాష్ట్ర శాఖల అధికారులు విద్యార్థులను, వారి తల్లిదండ్రులు, హెచ్‌ఎంలను సత్కరించి వందేమాతరం విద్యాదాత పురస్కారాలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌ను ప్రధానోపాధ్యాయుడు రాజన్న, ఎంఈవో విజయ్‌కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మంగ, సభ్యులు ఉపాధ్యాయులు అభినందించారు.



రాథోడ్ ఈశ్వర్

# మిల్లర్లపై చర్యలేవీ..?

- సీఎంఆర్‌ను గడువులోగా తిరిగి ఇవ్వని వైనం
- 21 మిల్లులు డిఫాల్టర్ అయితే.. చర్యలు తీసుకున్నది ఒక్కదానిపైనే..
- రెండేళ్లు కావస్తున్నా పట్టించుకోని అధికారులు
- 5,918 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లా.. మింగేసినట్లా..?



అధికారులు క్రిమినల్ కేసు నమోదు చేసిన ఇందారంలోని శివసాయి మల్లికార్జున ట్రేడర్స్ మిల్లు

మంచిర్యాల, జూన్ 7(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లాలో 2022-23 వానకాలం సీజన్‌కు సంబంధించి సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) బియ్యాన్ని మిల్లర్లు గడువులోగా ప్రభుత్వానికి తిరిగి ఇవ్వడంలో విఫలమయ్యారు. దీంతో 21 మిల్లులు డిఫాల్టర్ అయ్యాయి. ఈ మిల్లులకు 43,096.792 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఇందులో ఇప్పటి వరకు 23,123.668 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి పెట్టారు. ఇంకా 5,918.259 మెట్రిక్ ధాన్యం ప్రభుత్వానికి బకాయిపడ్డారు. ఇప్పుడు ఈ ధాన్యం మిల్లుల్లోనే ఉందా.. లేకపోతే ప్రైవేట్ మార్కెట్‌లోకి తరలిపోయిందా అనేది తేలాల్సి ఉంది. సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించకుండా కొందరు మిల్లర్లు వాటితోనే వ్యాపారం సాగిస్తున్నట్లు తెలుస్తున్నది. ప్రభుత్వ బియ్యాన్ని దొంగదారిలో ధర ఎక్కువగా ఉండే రాష్ట్రాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. మరికొందరు మిల్లర్లు మన ధాన్యాన్ని పక్క రాష్ట్రాల్లో అమ్మేసి, అక్కడ తక్కువ ధరకు దొరికే బియ్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వానికి అప్పగిస్తున్నారనే గుసగుసలు సైతం వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ధాన్యంతో మిల్లర్లు వ్యాపారం చేస్తుంటే ఇన్ని రోజులు అధికారులు ఏం చేస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. నిబంధనల ప్రకారం మిల్లర్లు సీఎంఆర్ బియ్యాన్ని ఏడాదిలోగా తిరిగి ఇవ్వాలి. కానీ పలుమార్లు గడువును పెంచుకుంటూ.. మధ్యలో ఓ వానకాలం వెళ్లిపోయి.. మళ్లీ వానకాలం (దాదాపు రెండేళ్లు) వచ్చే వరకు మిల్లర్లకు సమయం ఇచ్చారు. ఇంత చేసినా మిల్లర్లు ధాన్యం తిరిగి ఇవ్వలేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముందే నిబంధనల ప్రకారం ధాన్యం ఇవ్వని వారిపై చర్యలు తీసుకోకుండా, ఇప్పుడు ఏదో హడావుడి చేస్తూ చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు మిల్లర్ల విషయంలో పక్షపాతం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

## మిల్లులపై చర్యలేవి?

జిల్లా డిఫాల్టరైన మిల్లులు 21 ఉంటే, ఒక్క మిల్లర్ (ఇందారంలోని శివసాయి మల్లిఖార్జున ట్రేడర్స్ యాజమాని)పైనే క్రిమినల్ కేసు పెట్టి వదిలేశారు. డిఫాల్టరైన అందరినీ వదిలేసి ఒక్కరిపైనే చర్యలు తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మిల్లును తనిఖీ చేసినప్పుడు ధాన్యం స్టాక్ లేకపోవడంతో క్రిమినల్ కేసు నమోదు చేసిన అధికారులు.. మరి మిగిలిన మిల్లులను ఎందుకు తనిఖీ చేయడం లేదన్న ప్రశ్న తలెత్తుతున్నది. మిల్లుల్లో స్టాక్ పొజిషన్ ఏమిటో.. ఇంకా ఎందుకు నిగ్గు తేల్చడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మల్లికార్జున ట్రేడర్స్‌కు వానకాలం సీజన్‌లో 1268.748 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇవ్వగా, 257.941 మెట్రిక్ టన్నులు ఎఫ్‌సీఐకి పంపారు. ఇంకా 592.121 మెట్రిక్ టన్నులు బకాయి పడ్డారు. దీనికి 25 శాతం పెనాల్టీ కలుపుకోగా 740.151 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి వస్తుంది. కానీ మల్లికార్జున ట్రేడర్స్ కంటే కూడా ఇంకొన్ని మిల్లులు ఎక్కువ మొత్తంలో ప్రభుత్వానికి బకాయిపడ్డాయి. జిల్లాలోని దాదాపు 13 మిల్లులు అధిక ధాన్యం బకాయిలు చెల్లించాల్సి ఉంది. మరి వాటన్నింటిలో స్టాక్ పొజిషన్ ఏమిటి.. ధాన్యం ఉందా లేక మిల్లర్లు మింగేశారా.. అనేది తేలాల్సి ఉంది. కాగా డిఫాల్టర్ ఉన్న కొందరు మిల్లర్ల నుంచి సివిల్ సప్లయ్ అధికారులు డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. అందుకే ఆ మిల్లుల విషయంలో చూసీచూడనట్లు వ్యవహిస్తున్నారని, అందుకే చర్యలు తీసుకోవడానికి వెనకాడుతున్నారని కొందరు మిల్లర్లే చెబుతున్నారు.

## ఎక్కువ మొత్తంలో బకాయిలున్న మిల్లులు ఇవే..

జిల్లాలో మొత్తం 21 మిల్లులు డిఫాల్టర్‌లో ఉండగా, ఇందులో 13 మిల్లులు అధిక మొత్తంలో ప్రభుత్వానికి ధాన్యం బకాయి పడ్డాయి. బాలాజీ ఆగ్రో ఇండస్ట్రీస్ (టేకుమట్ల) 1371.452 మెట్రిక్ టన్నులు, నీలం బ్రదర్స్ మోడ్రన్ రైస్ మిల్లు 979.50 మెట్రిక్ టన్నులు, కనకమహాలక్ష్మి (కిష్టంపేట చెన్నూర్) 870.418, మల్లికార్జున ట్రేడర్స్ (ఇందారం) 740.151, దుర్గ ఇండస్ట్రీస్ 616.803, అన్నపూర్ణ ఆగ్రో మోడ్రన్ రైస్ మిల్ 546.326, శ్రీ వేంకటేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్ 460.802, వెంకటేశ్వర్ రైస్ మిల్ ఎంఎంఆర్ 422.145, లక్ష్మీనరసింహా రైస్ మిల్ (కలమడుగు) 330.709, వెంకటరమణ రైస్‌మిల్ (పెద్దంపేట) 306.094, మణికంఠ రైస్‌మిల్లు (తాళ్లపేట) 203.114 మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం బకాయిలు ఉన్నాయి. అన్ని మిల్లులు బకాయి పడిన ధాన్యం 5918.259 మెట్రిక్ టన్నులకు 25 శాతం పెనాల్టీ కలిపితే 7379.824 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. ఆలస్యమైనందుకు ప్రభుత్వానికి ఇచ్చే ధాన్యం విలువ మీద 12శాతం వడ్డీ కలిపి సివిల్ సప్లయ్ శాఖ డిఫాల్డరైన మిల్లర్ల నుంచి రూ.42,48,386 వసూలు చేయనున్నది.

### సీఎంఆర్ పెట్టకుంటే కేసులే



*సీఎంఆర్ బియ్యం మిల్లులు తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సిందే. గడువులోగా బియ్యం ఇవ్వని కారణంగా 23 శాతం పెనాల్టీ, 12 శాతం వడ్డీ తీసుకుంటాం. మొత్తం 21 మిల్లుల్లో కొందరు పెనాల్టీతో సీఎంఆర్ ఇచ్చేందుకు అంగీకరించారు. చర్యలు తీసుకుంటున్నాం.. కేసులు పెడుతున్నాం అని తెలిసి కూడా ఇప్పటికీ ఎఫ్‌సీఐకి బియ్యం పంపకుండా ఉంటున్న మిల్లులను తనిఖీ చేస్తాం. ఆ మిల్లుల్లో ధాన్యం లేని పక్షంలో నోటీసులు జారీ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే ఓ మిల్లుపై చర్యలు తీసుకున్నాం. మిగిలిన మిల్లులను తనిఖీ చేసి తప్పకుండా చర్యలు తీసుకుంటాం. సీఎంఆర్ ఎవ్వరూ పెట్టకపోయినా వారిపై కేసులు పెడతాం.* **- సభావత్ మోతీలాల్, అదనపు కలెక్టర్, మంచిర్యాల**



మంచిర్యాల పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేసే ట్యాంకు

# తాగునీటి తిప్పలు

- మంచిర్యాల మున్సిపాలిటీలో నిత్యం పైపులైన్ల లీకేజీలు
- ఈ రెండు నెలల్లో ఎక్కువసార్లు
- విసుగెత్తిపోతున్న జనం



హమాలీవాడలో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



పైపులైను మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మంచిర్యాలటౌన్, జూన్ 7: మంచిర్యాల పట్టణ ప్రజలు తాగునీటికి తిప్పలు పడాల్సి వస్తున్నది. నిత్యం ఎక్కడో ఒకచోట పైపులైన్లు పగిలిపోవడం, హుటాహుటిన వాటికి మరమ్మతులు చేయడం సర్వ సాధారణమైంది. మరమ్మతులు జరుగుతున్న రోజుల్లో ఆయా ప్రాంతాలకు నీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు అధికారులు ప్రకటిస్తున్నారు. గడిచిన రెండు నెలల్లో పట్టణంలోని 36 వార్డుల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగిన దాఖలాలు కనిపించ లేదు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎక్కువసార్లు పైపులైన్లు పగిలిపోవడం, లీకేజీలకు గురికావడంవంటి అంశాలు ప్రజలను ఆలోచించేలా చేస్తున్నాయి. అసలే వేసవి కాలం, అందులోనూ తాగునీరు, అత్యవసరమైన ప్రక్రియ, ఇంకేముంది, తోడుకున్నోళ్లకు తోడుకున్నంత అన్న చందంలా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గడిచిన రెండు నెలలుగా పట్టణంలోని 36 వార్డుల్లో తాగునీటి సరఫరా సక్రమంగా జరిగిన దాఖలాలు కనిపించ లేదు. పైపులైన్ల మరమ్మతులు జరుగుతున్నందున ఈ రోజు, రేపు నల్లాలు రావు' అనే స్టేటస్‌లు కౌన్సిలర్ల వాట్సప్‌లలో ఈ మధ్య కనిపిస్తున్నాయి. పైపులైన్లు లేని చోట, శివారు ప్రాంతాల్లో నివసించే ప్రజల కోసం నిత్యం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మరోవైపు రెడ్డికాలనీ, రాంనగర్, ఇస్తాంపుర, గౌతమీనగర్, మార్కెట్ ఏరియా, హమాలీవాడ ప్రాంతాల్లో బోర్లలో నీరు ఎండిపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడంలాంటి అంశాలతో నీటి కోసం జనం తండ్లాడుతున్నారు. తరచూ పైపులైన్లు పగిలిపోవడం, మరమ్మతులు చేయడంవంటివి విని విసుగెత్తి పోతున్నారు. దీనికి తోడు కరెంటు కోతల సమస్యను అధికారులు సాకుగా చెబుతున్నారు. గాలివానలకు కరెంటు పోయినప్పుడు నీటి సరఫరాలో ఇబ్బందులు ఉంటాయని అంటున్నారు.

## ఇబ్బందుల్లేకుండా చూస్తున్నాం

**- మధూకర్, మున్సిపల్ ఇంజినీర్**

పైపులైన్ల లీకేజీ అనేది నిరంతర ప్రక్రియ. పాతపైపులు కావడం, అవికూడా సిమెంటు (ఆర్‌సీసీ) పైపులు కావడం వల్ల వాటిపైనుంచి పెద్ద వాహనాలు వెళ్లినప్పుడు పగులుతున్నాయి. లీకేజీలు, మరమ్మతుల సమస్య ముందునుంచి ఉంది. పైపులైన్లలో నీటిప్రవాహం ఒత్తిడి కారణంగా కూడా అవి పగులుతుంటాయి. వాటికి మరమ్మతులు చేసుకోవాల్సి ఉంటుంది. ఏడాదికి సరిపడా మెటీరియల్‌ను కొనుగోలు చేసి దగ్గర పెట్టుకుంటాం. పనులు చేసేది మున్సిపాలిటీ వారే కనుక త్వరగా చేస్తున్నాం. ఈ మధ్యకాలంలో ముల్కల పంప్‌హౌస్ వద్ద కరెంటు లేని కారణంగా నీటిని ఇవ్వలేక పోయాం. తాగునీటి ఇబ్బందుల్లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

# సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్
- తిర్యాణి మండల సర్వసభ్య సమావేశానికి హాజరు
- వివిధ శాఖల అధికారుల తీరుపై ఆగ్రహం



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు,అధికారులు



మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి


తిర్యాణి,జూన్ 7 : ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్ అధికారులకు సూచించారు.శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన తిర్యాణి మండల సర్వసభ్య సమావేశానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశాల్లో వ్యక్తిగతంగా వాదించుకోకుండా పక్కన పెట్టి ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తమ విధులను దైవంగా భావించి ముందుకు సాగాలని కోరారు. ప్రస్తుతం అధికారుల పాలన కొనసాగుతున్న నేపథ్యంలో మండలాభివృద్ధికి పూర్తి సహకారం అందించాలన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన పలు అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పల్లెల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. అంతర్గత రోడ్లు, వంతెన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఇదిలా ఉండగా అంతకుముందు విద్యుత్ శాఖ ఏఈ కవిత తమ నివేదిక చదువుతుండగా, ఎమ్మెల్యే జోక్యం చేసుకొని ఆమె పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి సమస్యలు పరిష్కారం కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఎలాంటి నష్టం వాటిల్లినా బాధ్యత వహించాలని సూచించారు. అనంతరం తిర్యాణి రేంజర్ శ్రీనివాస్ తమ ప్రగతి నివేదికలు చదివి వినిపిస్తుండగా, ఎమ్మెల్యే కోవ లక్ష్మి కలగజేసుకొని ప్రభుత్వాలు కోట్లాది రూపాయలతో రోడ్లు నిర్మిస్తుంటే అడ్డుకోవడం సరైంది కాదన్నారు. మారుమూల గ్రామాల్లో 21 రోడ్ల నిర్మాణాలకు ఐటీడీఏ, పీఆర్, ఆర్అండ్‌బీ, ఎంఎంఎస్ ద్వారా నిధులు మంజూరయ్యాయని, టెండర్లు సైతం పూర్తయినట్లు తెలిపారు. అనుమతుల పేరిట రోడ్ల నిర్మాణాలను అడ్డుకోవడం వల్ల గిరిజనులు పడరాని పాట్లు పడుతున్నారని తెలిపారు. త్రీఇంక్లైన్ నుంచి సమ్మక్క గద్దెల వరకు రూ.8 లక్షలతో ప్యాచ్ వర్క్ పనులు జరుగుతుండగా, అడ్డుకోవడమేమిటని నిలదీశారు. వందేళ్ల చరిత్ర గలిగిన ప్రధాన రహదారిని అడ్డుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే అడ్డుకున్నట్లు ఎఫ్ఆర్వో నిర్లక్ష సమాధానం ఇవ్వడంపై మండిపడ్డారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. చివరి సర్వసభ్య సమావేశం కావడంతో ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్,వైస్ ఎంపీపీ కోవ పార్వతి,ఎంపీడీవో మల్లేశ్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ కమిటీల నియామకం

మంచిర్యాల, జూన్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌లకు నూతన చైర్మన్లు, పాలక సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మంచిర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పయ్యావుల పద్మ, వైస్ చైర్మన్‌గా బండారి సుధాకర్, లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దాసరి ప్రేమ్‌చంద్, వైస్ చైర్మన్‌గా ఎండీ ఆరీఫ్, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సిద్దల దేవయ్య, వైస్ చైర్మన్‌గా వర్ల తిరుపతిని నియమించింది. ఒక్కో మార్కెట్ కమిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌లకు సభ్యులు కలుపుకొని మొత్తం 18 మందితో కమిటీలు ఏర్పాటు చేసింది. రెండేళ్ల కాల పరిమితితో ఈ కమిటీలు పనిచేస్తాయని రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# సర్కారు బడుల్లో మెరుగైన విద్య

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

రెబ్బెన, జూన్ 7 : సర్కారు బడుల్లో కార్పొరేట్‌కు దీటుగా మెరుగైన విద్య అందుతున్నదని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం రెబ్బెన మండలం తక్కలపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం ఉంటుందని, బడీడు పిల్లలను గుర్తించి చేర్పించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం హర్షించదగిన విషయమని కొనియాడారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ప్రచురించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, ఎంపీటీసీ సంగం శ్రీనివాస్, డీఈవో అశోక్, డీఆర్‌డీవో సురేందర్, సమగ్రశిక్ష కో ఆర్డినేటర్లు మధూకర్, భరత్, తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శంకరమ్మ, ఎంఈవో వెంకటేశ్వరస్వామి, హెచ్‌ఎం మహేశ్వర్‌రావు, ఐకేపీ ఏపీఎం వెంకటరమణశర్మ, ఈజీఎస్ ఏపీవో రామ్మోహన్, తక్కలపల్లి, పులికుంట వీవో అధ్యక్షురాళ్లు, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఉన్నారు.



తాళ్లపేట సమీపంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతన్న

# పొలం పనుల్లో రైతన్న బిజీ

**వానకాలం సాగుకు** *రైతన్నలు సమాయత్తమవుతున్నారు. మృగశిరకార్తె ప్రవేశించడం.. తొలకరి జల్లులు పడడంతో పొలం పనుల్లో బిజీ అయ్యారు. శుక్రవారం దండేపల్లి మండలంలో తాళ్లపేట గ్రామ సమీపంలో ఓ రైతు ట్రాక్టర్‌తో దుక్కి దున్నతుండగా 'నమస్తే తెలంగాణ' క్లిక్ మనిపించింది.* *- దండేపల్లి, జూన్7*


నమస్తే తెలంగాణ

**విలేకరులు కావలెను**

**అర్హతలు :**

- పాత్రికేయులుగా పనిచేయాలన్న ఉత్సాహం.
- మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన.
- తెలుగు భాషపై పట్టు ఉండి.. చక్కగా రాయగలగాలి.
- ఇంటర్ ఉత్తీర్ణత సాధించి.. 35 ఏళ్లలోపు ఉండాలి.
- రిపోర్టింగ్‌పై ఆసక్తి ఉన్నవారురాత పరీక్ష, ఆ తర్వాత ఇంటర్వ్యూలకు హాజరుకావాలి.
- బయోడాటాతో రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు తెచ్చుకోగలరు.

**మంచిర్యాలకు కావలసిన కేంద్రాలు**

1. మంచిర్యాల అర్బన్ 2. పాత మంచిర్యాల 3. గర్మిళ్ల 4. భీమిని 5. బెల్లంపల్లి రూరల్ 6. లక్షెట్టిపేట రూరల్

**ఆసిఫాబాద్‌కు కావలసిన కేంద్రాలు**

1. ఆసిఫాబాద్ 2. ఆసిఫాబాద్ రూరల్ 3. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ 4. కాగజ్‌నగర్ టౌన్ 5. కాగజ్‌నగర్ ఎస్పీఎం

రాతపరీక్ష తేదీ : 10-06-2024 (సోమవారం)
సమయం : ఉదయం 11 గంటలకు..
స్థలం : వివేకవర్ధిని డిగ్రీ అండ్ పీజీ కాలేజీ, బస్ డిపో వెనక, జాఫర్‌నగర్, మంచిర్యాల జిల్లా.
ఫోన్ నంబర్ : 91827 77502



- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679